


# నల్లముసుగు

శివప్రసాద్

"చివరికి రేఖ జీవితం అలా అవుతుందని ఎప్పుడూ అనుకోలేదు, రవీ!" అంటూ ఇంకా ఏదో చెప్పటానికి ప్రయత్నించాడు శేఖర్. అంతలోనే వాడి కళ్ళలో నీళ్ళు తిరిగాయి గిరుక్కున. నన్ను కౌగిలించుకుని భోరుమని ఏడ్చాడు. నే నెలా తీర్చను వాడి బాధని? నాకూ రేఖలాంటి ముద్దుల చెల్లెలు ఉంటే ... ఆమె జీవితం కూడా రేఖలాగానే అయి ఉంటే ... ఓహ్! నా హృదయం కలుక్కుమంది. బాధతో గిలగిల్లాడింది.

• • • •

సుమారు పది సంవత్సరాల క్రితం ... రాత్రి తొమ్మిది గంటలు! "ఏం అమ్మా! మీ రిద్దరూ ఒకరు లేందే ఒకరు డైనింగ్ టేబిల్ దగ్గరికి రానే రారుగా! మరి నువ్వు ముందర వచ్చావేం?" అంటూ కుర్చీలో కూర్చుంటున్న కూతురి వంక చూస్తూ ముకుందరావుగారు అన్నారు.

"వస్తున్నా ..." అని రేఖ సమాధాన మిచ్చే వేళే "వచ్చేశా, డాడీ!" అంటూ శేఖర్ రేఖ పక్కగా కుర్చీలో కూర్చున్నాడు.

రంగయ్య! ప్లేట్లలో అన్నం వడ్డించపోయాడు.

"రంగయ్యా! నీ కెన్నిసార్లు చెప్పాలి? మా అన్నయ్యకి కంచంలో నేనే అన్నం పెట్టాలి! నువ్వు పెడితే వూరుకోను!" అని బుంగమూతి పెట్టింది రేఖ కోపంగా రంగయ్య వంక చూస్తూ.

"ఏరా, రంగయ్యా! అమ్మాయిని రోజూ ఏడిపించటం నీకు సరదా ఏమిట్రా" అని మందలింపుగా అన్నారు ముకుందరావుగారు.

"అమ్మా! అమ్మా! అంత కోపంగా చూడమాకమ్మా! పొరపాటైపోయింది. నన్ను కొట్టుతల్లీ" అంటూ గరిటె గిన్నెలో పెట్టేసి రేఖ ప్రక్కగా వచ్చి వంగున్నాడు. నిమిషం గడిచింది.

"కొట్టు, తల్లీ!" అని బతిమాలపోయాడు రంగయ్య.

"అమ్మా! రోజూ ఉన్నదేగా. వో దెబ్బ వడ్డించు. లేకపోతే మనకు వడ్డన జరగదు" అని ముకుందరావు అవగానే రేఖ వచ్చే నవ్వుని ఆపుకుంటూ రంగయ్యని ఎడంచేత్తో కొట్టింది.

""హమ్మయ్య!" అంటూ రంగయ్య నిటారుగా నిలబడ్డాడు.

"అమ్మా! రేఖమ్మా! ముసలాడ్ని సచ్చిపోయాను. ఇంతసేపు వంగోపెడితే ఎలా, తల్లీ!" అంటూ కూరలు వడ్డించాడు రంగయ్య వో చేత్తో నడుం పట్టుకుని.

"ముసలాడి వయ్యావు! కాని ఇంకా బుద్ధి

పెరగలేదు!'' అంది రేఖ.

''తప్పమ్మా! నీ కంటే పెద్దవాడివి అలా అన కూడదు!'' అంటూ ముకుందరావుగారు కూతుర్ని వారించారు.


''వూరుకోండి, బాబూ! రేఖమ్మగారు నన్నేంత తిడితే నా కంత సంతోషం! తిట్టు, తల్లీ! బాబుగా రట్టాగే అంటారులే!'' అని రేఖ వంక నవ్వుతూ చూశాడు రంగయ్య.

రేఖ నాలిక బయటపెట్టి 'య్యయ్యయ్య' అని వెక్కిరించింది. రంగయ్య నవ్వుకున్నాడు.

శేఖర్ అన్నం, కూర కలిపి రెండు ముద్దలు చేసి ఒక ముద్ద రేఖ నోట్లో పెట్టాడు.

''బాబూ! ఎంత అన్నా చెల్లెళ్లయినా ఇటువంటి అనుబంధం ఎక్కడా చూడలేదు'' రంగయ్య మురిసి పోతూ ముకుందరావుతో అన్నాడు. ఆయన పెదవులపై గర్వంతో కూడిన దరహాసం మెదలాడింది.

ముకుందరావుగారు పన్నెండేళ్ళ కూతురి వంక




చూశారు ప్రేమగా. ''రేఖా! నీ అందానికి సరిపోగల అల్లుడిని తెచ్చుకోగలనో లేదో, తల్లీ!'' అని మనసులోనే సందేహపడసాగారు ఆయన.

రేఖ కళ్ళకు రాళ్ళను కరిగించే శక్తి ఉంది. గొప్ప ఆకర్షణ ఉంది. ఆమె మాటల్లో ఏదో మాధుర్యం ఉంది.

''ఇదంతా పన్నెండేళ్ళ ప్రాయంలోనే!'' అంటూ ఆశ్చర్యపో నక్కర్లేదు.

ఆకాశం నల్లగా, దట్టంగా, రాకాసిలా ఉంది. చీకటి అంతా మబ్బుగా మారి ఆకాశాన్ని కమ్మేసిందా అన్నట్టుగా ఉంది. ఎక్కడో ఉరిమింది. రేఖ గుండె దడదడలాడింది. భయభ్రాంతురాలయింది. చేతిలోని ముద్ద నోటిలోకి పోలేనని మొరాయించింది.

''చూశారా, డాడీ! రేఖకి ఉరుమంటే ఎంత భయమో! ఈ రోజు మీ దగ్గరే పడుకోబెట్టుకోండి'' అని పెద్దరికంగా చెప్పాడు పదిహేనేళ్ళ శేఖర్.

''ఆ నాకేం భయంలేదు! నీకే భయం! నువ్వే నా గదిలో పడుకుంటావు ఉరిమినప్పుడల్లా!'' అంది రేఖ తనలోని భయాన్ని కప్పిపుచ్చుకోడానికి ప్రయత్నిస్తూ.

''పోవే! నీ దగ్గర ఎవరు పడుకుంటారు? నేను నా గదిలోనే పడుకుంటా నివ్వాళ!'' అన్నాడు శేఖర్ ఉడికింపుగా.

''అమ్మా! ఈ రోజు నా గదిలోనే పడుకో'' అన్నారు ముకుందరావుగారు.

''ఫో, డాడీ! నేనేం పసిపిల్లను కాను. నాకేం భయం లేదు. ఇవ్వాళ నా గదిలోనే పడుకుంటాను'' అంది మొరాయింపుగా.

''పోన్లే, తల్లీ! పోనీ నేనే నీ గదిలో పడుకుంటాను'' అన్నారు ముకుందరావుగారు చిరునవ్వు నవ్వుతూ.

''అంటే నాకు భయమనేగా!'' అని అంది రేఖ, ఇంకా తండ్రి తనని పెద్దదానిగా గుర్తించనందుకు బాధపడిపోతూ.

''పోన్లే అమ్మా! నీ ఇష్టం. నీకు భయంలేకపోతే నా కెందుకు భయం'' అన్నారు ముకుందరావుగారు.

భోజనం ముగిసింది. అబ్బాయి, అమ్మాయిల భోజనాలు కాగానే వారిని పడుకోబెట్టమని రంగయ్యకి చెప్పి ఎప్పటిలాగే బయటికి నడిచారు ముకుందరావుగారు. కారు కదిలింది. క్లబ్బుకి వెళ్ళింది.

రంగయ్య తనుకూడా భోజనం ముగించాడు. శేఖర్, రేఖలను నిద్రపుచ్చి, గదుల్లో లైట్లు ఆర్పి, బెడ్ లైట్లు వెలిగించాడు. తను డ్రాయింగ్‌రూమ్‌లోకి వచ్చి నిద్ర కుపక్రమించాడు. వర్షం జోరు ఎక్కువయింది.

● ● ● ●

రంగయ్యకి మెలకువ వచ్చింది. గోడ గడియారం వంక చూశాడు. చూపు ఆనటం లేదు. మెల్లగా లేచి లైటు వేసి చూశాడు. పదకొండు గంటలు! డైనింగ్ హాల్ దాటి శేఖర్, రేఖల గదుల వైపు వచ్చాడు. ఇద్దరూ తమ తమ గదుల్లో సుఖనిద్రలో ఉన్నారు. రంగయ్య తిరిగి వచ్చి పడుకున్నాడు.

● ● ● ●

ఏవో శబ్దాలు వినవడుతున్నాయి. రంగయ్య ఉలిక్కిపడ్డాడు. పిల్లలు కీచులాడుకుంటున్నట్టున్నాయి! 'హమ్మయ్య!' అనుకుని పడుకోబోయాడు. వర్షం ఉధృతంగా పడుతున్న శబ్దం...కిటికీలోంచి బయటికి చూశాడు. కారుచీకటి... మధ్య మధ్య మెరుపులు. రంగయ్య లైటు వేసి టైమ్ చూశాడు. పన్నెండు గంటలు మాత్రమే! లైటు ఆఫ్ చేయ బోయాడు. అంతలో కరెంటు పోయింది. గది అంతా చీకటి! రంగయ్య కళ్ళ కేమీ కానరావటం లేదు. మేను వాల్చబోయాడు.

''దొంగ! రంగయ్యా! దొంగ!'' అన్న గావుకేక వినపడింది అంతలో. రంగయ్య గుండెలో రైళ్ళు పరిగెత్తాయి.

''దొంగ ... దొంగ ... రంగయ్యా ... దొంగ'' రేఖ పిచ్చిగా అరుస్తోంది.

రంగయ్యకి కాలు, చేయి ఆడటం లేదు. ఏం చేయాలో పాలుపోవటం లేదు. అంతలోనే ఎవరో పరుగెత్తిన అడుగుల సవ్వడి!

ఇంక ఆలస్యం చేయకూడ దనుకున్నాడు రంగయ్య. ఆ చీకటిలో బ్యాటరీ లైటు ఎక్కడుందో కనపడటం లేదు. ధైర్యం కూడదీసుకుని రేఖ గదివైపు నడవ బోయాడు. అంతలోనే లైటు వెలిగింది. హమ్మయ్య అనుకుని వడివడిగా ఆ వైపు వచ్చాడు. గదిలో రేఖ స్పృహ తప్పి పడి ఉంది. రంగయ్య కంగారుగా శేఖర్ గదిలోకి వచ్చాడు. శేఖర్ నిద్రపోతున్నాడు. 'హు! ఈ శేఖర్ బాబు ఇంతే! మిన్ను విరిగి మీద పడుతున్నా తెలియని నిద్రపోతూ ఉంటాడు!' అనుకుని మరల రేఖ గదిలోకి వచ్చాడు. రేఖ ముఖంపై నీళ్ళు చల్లాడు. కొంతసేపటికి రేఖ కళ్ళు తెరిచింది. రంగయ్యని గట్టిగా వాటేసుకుంది.

''ఏం తల్లీ! ఏమయింది?'' అంటూ వెన్ను మీద లాలింపుగా తడిమాడు.

రేఖ జవాబివ్వలేదు. వెక్కివెక్కి ఏడుస్తోంది.

''పదమ్మా! శేఖర్ బాబు గదిలోకి వెళదాం'' అన్నాడు రంగయ్య.

మారు మాట్లాడకుండా రేఖ రంగయ్యతో శేఖర్ గదిలోనికి వచ్చింది.

రంగయ్య శేఖర్‌ని లేపి జరిగిన దంతా చెప్పాడు. శేఖర్ ముఖంలో విభ్రాంతి. రేఖ కళ్ళలోని భయాన్ని చూసి చలించి పోయాడు శేఖర్! ఆమెను ఆప్యాయంగా తన పక్కన కూర్చోబెట్టుకుని జరిగినది వివరంగా చెప్పమని అడిగాడు. రేఖ భయంతో బిగుసుకు పోయింది. ఏదో చెబుదామని ప్రయత్నిస్తోంది. కాని ఏమీ చెప్పలేదు. అడగ్గా అడగ్గా చివరికి చెప్పింది.

తనని ఎవరో తట్టి లేపారు. కళ్ళు తెరిచిచూసింది. బెడ్ లైటు వెలగటం లేదు. గది అంతా చీకటి. తనకి కొన్ని క్షణాలపాటు ఏమీ కనపడలేదు. మెల్లగా ఏదో ఆకారం తనముందు ఉందని గ్రహించసాగింది. తను భయంతో బిగుసుకు పోయింది. అంతలోనే ఆ భయంకరమైన నల్లని ఆకారం తన మంచం పక్కన అటూ ఇటూ గంతులు వేయసాగింది. ఆ తరవాత తన మీదికి రాసాగింది. అంతలోనే

తన కళ్ళలోకి మిరుమిట్లు గొలుపుతూ కాంతి దూసుకు పోయింది. మరుక్షణం ఆ వెలుగు ఆగి పోయింది. తాను డాడీ, అన్నయ్యా అని అరుద్దామని ఎంత ప్రయత్నించినా మాట పెదవులు దాటి బయటకు రాలేదు. చివరికి 'రంగయ్యా!' అని అరవ గలిగింది. తను అలా కేక పెట్టగానే ఆ ఆకారం పరుగెత్తుకుంటూ వెళ్ళిపోయింది.

"ఇంతకీ ఆ ఆకారం ఎవరంటావమ్మా? మనిషేనంటావా?" సందేహంగా అడిగాడు రంగయ్య.

రేఖ జవాబివ్వలేదు.

"చెప్పు, తల్లీ!" రంగయ్య రెట్టించి అడిగాడు.

"కాదు! దయ్యం!" అని వెంటనే ఏడవసాగింది రేఖ.

శేఖర్ నిశ్చేష్టుడయ్యాడు.

"ఊరుకో, తల్లీ! ఏడవకూడదు! దయ్యమా ఇంకే మైనానా" అని కొట్టి పారేస్తున్నట్లుగా అన్నాడు రంగయ్య. ఇంతలోనే ఏదో సందేహం వచ్చింది.

"మరి దయ్యమైతే 'దొంగ! దొంగ!' అని ఎందు కరిచావమ్మా?" అని అడిగాడు అనుమానంగా.

"దయ్యమని అరుద్దామనుకుంటే నోరు పెగల్లేదు చివరికి ఏమని అరిచానో నాకు సరిగా గుర్తు లేదు" అని ఏడవటం ఆపి చెప్పింది రేఖ. భయం పూర్తిగా పోకపోయినా కొంచెం కొంచెంగా ధైర్యం పుంజు కుంటూంది రేఖ.

కాని రంగయ్య ఆలోచనలు వేరుగా ఉన్నాయి. అతనికి దయ్యాల మీద అంతగా నమ్మకం లేదు 'దయ్యం అయి ఉండదులే' అని అనుకున్నాడు 'అంతలోనే మరో రకం ఆలోచనలు రంగయ్య మెద డులో ప్రవేశించాయి.

మరి దొంగే కనక వచ్చి ఉంటే అమ్మాయి గారిని తట్టి ఎందుకు లేపుతాడు? భయ పెట్టాలని ఎందు కనుకుంటాడు? దొంగతనానికి వచ్చిన వాడు చేతి కందిన దేదో తీసుకుని పారిపోదామనుకుంటాడు కానీ పిచ్చి చేష్టలు ఎందుకు చేస్తాడు? గంతులు ఎందుక్కేస్తాడు? ఏదో సందేహం. వెంటనే రంగయ్య ఇల్లంతా చూసి వచ్చాడు. ఏ తలుపులూ తీసిలేవు. వేసిన తలుపులు వేసినట్లే ఉన్నాయి. అయితే దయ్యమేనా! అవును! ఖచ్చితంగా దయ్యం చేష్టలే. ఊహూఁ! అమ్మాయిగారి కన్ను చెదిరి ఉండవచ్చు. ఆహాఁ! లేదు! తను ఎవరో పరిగెత్తుకు వెళుతున్న అడుగుల సవ్వడి విన్నాడు. ఏమనుకోవాలో అర్థం కాకుండా ఉంది రంగయ్యకి. అయోమయంగా చూశాడు శేఖర్ వైపు.

"ఏంటి, రంగయ్యా, అంతగా ఆలోచిస్తున్నావ్!" శేఖర్ అడిగాడు.

"శేఖర్ బాబూ! వచ్చింది దొంగా, దయ్యమా తెలియకుండా ఉంది!" అన్నాడు రంగయ్య బుర్ర గోక్కుంటూ.

"దొంగ దయ్యం అయ్యుంటుంది!" అన్నాడు శేఖర్ నవ్వుతూ చెల్లెలి వంక కవ్వింపుగా చూస్తూ.

"మీకు వేళాకోళంగా ఉంది, బాబూ!"

"మరి లేకపోతే ఏమిటి, రంగయ్యా? దొంగేమిటి? దయ్యమేమిటి? మతి లేకపోతేను. రేఖ కన్ను చెదిరి ఉండవచ్చు!" అన్నాడు. 'అంతే కదూ!' అన్నట్టుగా రేఖ వంక చూస్తూ.

"అంతేనంటారా బాబూ?" అన్నాడు రంగయ్య.

"ఇంకా సందేహమా!"

"కాని, బాబూ! ఏదో అడుగుల సవ్వడి విన్నాను."

"ఇంక ఊరుకో, రంగయ్యా! నువ్వు రేఖని మించి పోయావు" అన్నాడు శేఖర్ మధ్యలో కలగ జేసుకుంటూ.

"అన్నయ్యా! నాకు నిద్ర వస్తోంది. నీ దగ్గరే పడుకుంటాను" అంది రేఖ.

"అలాగే!" అన్నాడు శేఖర్.

రంగయ్య లైటు ఆర్పి వెళ్ళిపోయాడు. శేఖర్, రేఖ నిద్ర కుపక్రమించారు. రేఖ శేఖర్‌ని గట్టిగా కరుచుకుని పడుకుంది. 'ఓసి పిచ్చి! ఎంత భయపడి పోయావ్!' అనుకున్నాడు శేఖర్. ఆమెను జోకొట్టి నిద్ర పుచ్చాడు.

• • • •

రోజులు గడుస్తున్నాయి. రేఖ లేత హృదయంపై ఆ సంఘటన ప్రభావం క్రమ క్రమంగా ఎక్కువ కాసాగింది. చీకటి అంటే భయం. అప్పుడప్పుడు నిద్రలో కేకలు వేస్తూ ఉంటుంది. ప్రస్తుతం రేఖ, శేఖర్, ముకుందరావుగారు ఒకే గదిలో పడుకుంటు న్నారు. చీకటిని పారదోలేందుకు విద్యుద్దీపాలు రాత్రి సమయంలో అవిరామంగా వెలుగుతూనే ఉంటాయి.

ముకుందరావుగారు బిజీ మనిషి. ఎందుకో ముందు ఈ సంఘటన ప్రభావం కూతురి జీవితంపై ఎలా పరిణమిస్తుందో వూహించేంత తీరిక ఆయన కుండదు..

శేఖర్‌ని చెల్లెలిలో వచ్చిన మార్పు కలచివేస్తోంది.

"డాడీ! రేఖని సైకియాట్రిస్ట్‌కి చూపిస్తే" అని ఒక రోజు అతను ముకుందరావుగారితో అంటే, ఆయన కసురుకున్నారు. "దాని బతుకు నాశన మవు తుందిరా" అన్నారు ఆవేశంగా, ఆవేదనగా. మొన్ననే పదమూడవ ఏట అడుగిడిన రేఖ జీవితం సైకియా ట్రిస్ట్‌కి చూపిస్తే ఎందుకు నాశనమవుతుందో పదహారవ ఏట అడుగిడిన శేఖర్ వూహకు అందలేదు. 'డాడీ! బొత్తిగా ఏదీ పట్టించు కోరు!' అని బాధ పడసాగాడు శేఖర్.

ఋతువులు మారుతున్నాయి. మరల వర్షాకాలం.. దట్టమైన మబ్బుల....ఉరుములు...కుంభవృష్టి ... పగలే చీకటిగా మారిన రోజు.

రంగయ్య తన దగ్గిర బంధువు లెవరో పోయా రంటే ఆ వూరికి రెండ్రోజులు సెలవు తీసుకుని వెళ్ళాడు. శేఖర్ ఇంకా కాలేజీనుంచి రాలేదు. ముకుంద రావుగారు ఇంటికి ఎప్పుడు వస్తారో ఆయనకే తెలియదు. రేఖ ఒక్కతే ఆ లంకంత ఇంటి తలుపులు అన్నీ బిడాయించుకుని లోపల నుంచే ఇంటికి తాళం వేసుకుని తన గదిలో పడుకుని ఉంది. రంగయ్య లేకపోతే ఆమె స్కూలుకు వెళ్ళదు.

ప్రకృతిలోని మార్పులేవీ పట్టని గాఢనిద్రలో ఉంది రేఖ ! ఎక్కడో ఉరుము. వెనువెంటనే పిడుగు. అది తనమీదే పడినట్టుగా భయపడి మేలుకుంది. అంతా చీకటి. 'అప్పుడే చీకటిపడిందా!' అని విస్తుపోయింది. వాచీ చూసింది. రేడియం డయల్ 4—30 గంటలు చూపిస్తోంది! అది ఇంకా సాయం సమయమేనని నమ్మలేక వాచీని చెవి దగ్గరగా పెట్టుకుంది. 'టిక్ టిక్ టిక్....'వాచీ పనిచేస్తోంది.

బయట వర్షం, ఈదురు గాలి జోరు ఎక్కువ గానే ఉన్నా, తలుపులు అన్నీ మూసివేసి ఉండటంతో వర్షం పడుతోందని రేఖ గ్రహించటానికి కొంత సమయం పట్టింది. మంచంమీదినుంచి లేచి మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ కిటికీ వైపు నడిచింది. తలుపు తీసిందో లేదో ఈదురు గాలి కాచుకుని కూచున్నట్లుగా గదిలోకి జొరబడి రేఖని ఉక్కిరి బిక్కిరి చేసింది. కిటికీ తలుపు పదే పదే కొట్టుకోసాగింది. అద్దం పగిలి క్రింద పడిన శబ్దం. రేఖ ఉలిక్కిపడింది. కొంచెంసేపు కష్టపడి రేఖ కిటికీ మూసివేసింది. లైటు వేయబోతే వెలగలేదు. కరెంటు కూడా లేదన్న




మాట అనుకుని తిరిగి ప్రక్కపై వాలింది. గుండెలో గుబులుగా ఉంది. అన్నయ్య త్వరగా వచ్చేస్తే బాగుండు ననిపించింది. కళ్ళు మూసు కుంది బలవంతంగా. కొద్ది సమయం గడిచింది. రేఖ నిద్రలోకి జారుకుంది.

* * * *

ఎవరో తట్టి లేపుతున్నారు. ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది రేఖ. ఎవరూ కనపడలేదు! కళ్ళు మూయాలంటే భయం. అలాగే ఆ చీకటిలో చిత్రరచనలు చూస్తూ ఉండిపోయింది. క్రమ క్రమంగా ఆమె కళ్ళముందు ఏదో ఆకారం రూపు దిద్దుకుంటోంది. అంతలో ఆ ఆకారం మునుపటిలాగే గంతులు వేయసాగింది. ఏదో

వెలుగు మరుక్షణం రేఖ కళ్ళలోకి చొచ్చుకు పోయింది. అంతలోనే ఆ వెలుగు మాయమయింది. రేఖకి ఈసారి ఆ ఆకారం కనిపించలేదు. కొద్ది క్షణాలు గడిచిపోయాయి. ఆ ఆకారం వెళ్ళిపోలేదు. రేఖ మరల ఆ ఆకారాన్ని చూడగలుగుతోంది. కాని ఆమె కీసారి అరవాలనిపించటం లేదు. అసలామె గుండెలో భయమే లేదు!

రేఖ కెందుకో ఆ ఆకారాన్ని సంతోష పెట్టాలని, మంచి చేసుకోవాలని బలంగా అనిపించసాగింది.


"ఏం కావాలి నీకు?" అని అడిగింది ధైర్యంగా.

ఏమీ సమాధానం లేదు.

"నీకేం కావాలన్నా ఇస్తాను! చెప్పు!" అని రెట్టించి అడిగింది మృదువుగా.

దయ్యాలు ఏం కోరితే...అవి ఇచ్చేస్తే... అవి తమ జోలికి రావని, హాని చేయవని, ఇంకా అవసరమైతే మేలు చేస్తాయని ఎక్కడో ఎప్పుడో చదివిన గుర్తు. ఆ బలమైన విశ్వాసంతోనే రేఖ ధైర్యంగా మాట్లాడగలుగుతోంది.

"ఏమిస్తావ్?" ఆ ఆకారం గంభీరంగా ప్రశ్నించింది.




"నువ్వేం కావాలంటే అది ఇస్తాను!"

"నిజంగా!"

"నిజం!"

"క్రిందటిసారి నే నొచ్చినప్పుడు భయంతో అరిచావుగా! ఇప్పుడు భయం లేదా!?"

"ఉహు!" అడ్డంగా తల ఆడించింది రేఖ.

"ఏం! ఎందుకని?" విస్మయంగా అడిగింది ఆ ఆకారం.

"ఏమో...కాదు! నువ్వంటే నాకిష్టం!" అంది అమాయకంగా.

"మరయితే నీ ఒంటిమీద ఉన్న నగలన్నీ నా కిచ్చేస్తావా?"

అటువంటి అవకాశం కోసమే ఎదురు చూస్తున్న దవటం మూలంగా "ఓ..." అని ఎగిరినంత పని చేసింది రేఖ. మెడలోని గొలుసు, ముక్కు పుడక, దుద్దులు, కాళ్ళకున్న గజ్జెలు తీసి సంతోషంగా ఆ ఆకారాని కిచ్చేసింది. అవి పుచ్చుకుంటూ "మరి నీ చేతికున్న వాచీ ఇవ్వవా?" అని అడిగింది ఆ ఆకారం.

"నువ్వడగ లేదుగా..." అంటూ వాచీ కూడా తీసి అందించింది రేఖ. నగలు, వాచీ ఇచ్చేసినందుకు ఆమెలో కించిత్తు బాధ లేదు. పైపెచ్చు ఏదో ఆనందం..ఆ దయ్యం తననేమీ చేయదన్న ధైర్యం.

"నీ ప్రక్కన కూర్చోనా?" ఈసారి ఆ ఆకారం ఎంతో మృదువుగా అడిగింది.

తన పథకం పారినందుకు మురిసిపోయింది రేఖ.

"ఓ...తప్పకుండా" అంటూ జరిగింది. ఆ ఆకారం మంచంమీద రేఖ ప్రక్కగా కూర్చుంది.

"అయితే నేనంటే నీ కిష్టమేగా?"

"ఊ!" ముద్దొచ్చేట్టుగా అంది రేఖ.

"నేనంటే భయం లేదుగా?"

"లేదు!" నిర్భయంగా నిశ్చయంగా చెప్పింది.

"అయితే ... అప్పుడప్పుడు రావచ్చా?"

"తప్పకుండా!"

"నే నొచ్చానని ఎవ్వరికీ చెప్పవుగా?

"ఉహుఁ! చెప్పను."

"ఇంతకీ నేను ఎవరని అనుకుంటున్నావ్?"

"........."

"చెప్పవా?"

"దయ్యం కదూ" అంది రేఖ సన్నని గొంతుతో.

ఆ ఆకారం ఏమీ అనలేదు. నిర్లిప్తంగా ఉండిపోయింది. కాసేపయ్యాక, "వస్తాను పాపా!" అని అక్కడ నుంచి కదిలి వెళ్ళబోయింది ఆ ఆకారం.

"నువ్వు నన్ను ఏమీ చెయ్యవు కదూ?" బిక్కుబిక్కుమంటూ అడిగింది రేఖ.

ఆ ఆకారం రేఖ దగ్గరగా వచ్చి, తలపై చెయ్యి వేసి "నీ లాంటి అందమైన పాపని నేనేమీ చెయ్యను! పైగా నే నడిగినవన్నీ ఇచ్చేశావుగా! నువ్వంటే నాకెంతో ఇష్టం!" అని నుదుటి మీద ముద్దు పెట్టి అక్కడి నుంచి వడివడిగా వెళ్ళిపోయింది.

రేఖ గుండె మీది నుంచి కొండలంత బరువు తీసేసినట్లయింది. ఆమె హృదయం దూదిపింజలా తేలిపోసాగింది. సంతోషంలో ఉప్పొంగిపోసాగింది. 'తనని ఈ దయ్యం ఏమీ చెయ్యదు!' అన్న బలమైన నమ్మకం రేఖకు ఏర్పడింది.

అమ్మయ్యకోసం ఎదురు చూస్తూ నిశ్చింతగా, హాయిగా ప్రక్క మీద వాలింది. కొంత సమయం గడిచింది. గది అంతా వెలుతురుమయం! రేఖ మూసుకున్న కనురెప్పలు తెరిచింది. 'హమ్మయ్య! కరెంటు వచ్చేసింది' అని సంబరపడింది. కాస్త కాఫీ కలుపుకుందామని ప్రక్క మీది నుంచి లేచింది. డైనింగ్ హాల్లోకి వచ్చింది.

ఆశ్చర్యం! తను తీసిచ్చిన నగలూ, వాచి డైనింగ్ టేబిల్ మీదే ఉన్నాయి. రేఖ సంతోషానికి అవధుల్లేవు. ఆమె లేత హృదయం 'ఎంత మంచి దయ్యం' అని మురిసిపోయింది. ఆ దయ్యం మరల కనపడితే బాగుండుననుకుంది. అ ఎప్పుడూ చీకటిలోనే వస్తుంది. వెలుతురుండగా వస్తే దయ్యమెలా ఉంటుందో తను చూసి ఉండేది అని బాధ పడింది.

• • • •

సెకన్లు . . . నిమిషాలు . . . . గంటలు. . . వారాలు. . . .పక్షాలు. . .

ఇప్పుడు శేఖర్, రేఖ, ముకుందరరావుగారు ఎవరి గదుల్లో వారు పడుకుంటున్నారు. రేఖకి చీకటి అంటే భయం లేదు. నిద్రలో కేకలు వేయదు.

శేఖర్ చెల్లెలు మామూలు మనిషి అయినందుకు ఉప్పొంగిపోయాడు. తన చెల్లెలు మరల తనకు దక్కిందని సంబరపడ్డాడు.

ముకుందరావుగారిలో గుండె మీది నుంచి అప్పుడే కుంపటి దింపేసినంత ఆనందం. సైక్రియాట్రిస్టుదగ్గరికితీసుకువెళితే... ఆవిషయం నలుగురి నోళ్ళలో పడితే. . . "పిల్లకేం—మేలిమి బంగారం... కాని ఏం లాభం. . .పిచ్చిదమ్మా" అని నలుగురు అనేసుకుంటే! ఇలా రకరకాలుగా వూహించి భయపడి ముకుందరావుగారు కూతుర్ని సైకియాట్రిస్టు దగ్గరికి తీసుకువెళ్ళలేకపోయారు. కాని, అటువంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం లేకుండా తన కూతురు మామూలు మనిషి అయినందుకే ఆయన ఆనందం! ఆ ఆనందంలో క్లబ్బుల్లో తన గంటల్ని వెచ్చించాడు.

• • • •

పక్షాలు. . .నెలలు. . .సంవత్సరాలు. . .

రేఖ ఇంటర్మీడియట్ ఫస్ట్ క్లాసులో పాసయింది. శేఖర్ తనకి, చెల్లెలికి, తండ్రికి సినిమా టికెట్లు తీసుకువచ్చాడు.

సినిమా రసవత్తరంగా సాగుతూంది. శేఖర్, రేఖ సినిమాలో లీనమైపోయారు. ముకుందరావుగారు మాత్రం శేఖర్, రేఖల మధ్య కుర్చీలో ఇబ్బందిగా కదులుతున్నారు. ఫస్టుక్లాసులో పాసయిందన్న సంతోషంలో కూతురి మాట కాదనలేక, పైగా వాళ్ళతో సరదాగా కొంత సమయం గడపాలన్న కోరిక చంపుకోలేక మాత్రమే సినిమాకి వచ్చారు కాని, మనసు క్లబ్బుపైపే మొరాయిస్తూంది.

తెర మీద దొంగ నల్లటి ముసుగులో చేతిలో బ్యాటరీ లైట్తో లైటు ఆర్పి ఉన్న గదిలో



ప్రవేశించాడు. మంచం మీద కథానాయిక, ప్రక్కనే ఆమె తల్లి పడుకుని ఉన్నారు. ఆ మంచం పక్కనే ఇనప్పెట్టె! దాని తాళాలు తల్లి చీర మీది నుంచి బొడ్డు దగ్గరగా వేళ్ళాడుతున్నాయి.

దొంగ ఆమెని లేపి కళ్ళలోకి టార్చిలైట్ వేశాడు. ఆమె భయంతో కంపించి పోయింది. 'దొంగ! దొంగ' అని అరిచింది. దొంగ చటుక్కున మరొక చేతితో చాకు తీసి ఆమె గడ్డం క్రింద ఆన్చాడు. ఇంతలో కథానాయిక లేచింది. భయభ్రాంతురాలయింది ఆమె కూడా 'దొంగం దొంగ' అని అరవటంతో దొంగ ఆమెని చాచిలెంపకాయ కొట్టాడు. కథానాయిక స్పృహ తప్పిపడిపోయింది. దొంగ కథానాయిక తల్లిని నగలన్నీ తీసి ఇవ్వమని గదమాయిస్తున్నాడు. ఆమె ఒక్కొక్కటే ఒంటి మీద నుంచి తీస్తోంది. అంతలో సీను మారింది. కథానాయకుడు కారు యాక్సిడెంట్‌లో గాయపడి మరణించిన కథానాయిక తండ్రిని భుజాలపై మోసుకుని దొంగ ఉన్న గదివైపు వస్తూ ఉంటాడు. ఉత్కంఠ కలిగిస్తున్న సన్నివేశం! ప్రేక్షకులు 'ఇప్పుడేమవుతుందా?' అని ఉగ్గబట్టుకు చూస్తున్నారు.

ముకుందరావుగారు మాత్రం అసహనంగా కుర్చీలో కదిలారు. ఆయన తనకు ఎడంప్రక్కగా కూర్చుని ఉన్న రేఖవైపు అనుకోకుండా చూశారు. ఆయన దిగ్భ్రాంతి చెందారు. రేఖ దుద్దులు, ముక్కు పుడక, మెడలోని గొలుసు, చేతికున్న గాజులు, వాటి ఒకదాని తరువాత ఒకటే తీసేస్తోంది. ముకుందరావుగారికి నోటమ్మట మాట రావటం లేదు!

రేఖ ఆ వస్తువులన్నీ ముందు సీట్లో కూర్చున్న వ్యక్తికి ఇవ్వబోయింది. ముకుందరావుగారు ఆమెని వారించారు. కాని ఆమె తండ్రితో పెనుగులాడుతూంది. ఏం జరుగుతూందో శేఖర్‌కి అంతుపట్ట లేదు.

"వాట్, డాడీ! ఏమైంది. . .?" అని ఒక్క ఉదుటున కుర్చీలో నుంచి లేచి తండ్రిని అడిగాడు. రేఖ తండ్రిని ఒక్క తోపు తోసింది. ఆ నగలన్నీ ఇచ్చి వేయాలన్న పట్టుదలతో ఉందామె. ఇంతలో థియేటర్‌లో కలవరం మొదలయింది. ముకుందరావుగారు ఆ తోపుకి శేఖర్ మీద పడ్డారు. శేఖర్ తండ్రిని గట్టిగా పట్టుకున్నాడు. ఈ లోపల రేఖ నగలు ఆ ముందు వ్యక్తి చేతిలో పెట్టేసింది. ఆ మనిషి బిత్తర పోయాడు. థియేటర్‌లో కలవరం తారస్థాయికి చేరుకుంది. లైట్లు వెలిగాయి—సినిమా ఆపివేశారు కొంతసేపు.

• • •

హృదయ భారంతో సినిమా మధ్యలోనే ఇంటికి తిరిగి వచ్చారు ముగ్గురూ.

నాలుగేళ్ళ క్రితం జరిగిన సంఘటన రేఖ

హృదయ ఫలకం నుంచి శాశ్వతంగా చెరిగిపోయిందనుకున్నారు. కాని ముసుగులో ఉన్న దొంగని, ఆ దృశ్యాన్ని చూస్తుంటే ఆమెకు మరల ఆ జ్ఞాపకాలు రావడంతో ముకుందరావుగారు పక్షవాతం వచ్చిన మనిషిలా అయిపోయారు. కేవలం ఒక్కసారి రేఖ చూసిన దృశ్యం ఆమెపై ఇంతగా ప్రభావం చూపటం ఆయనకు వింతగా అనిపించింది. 'సైకియాట్రిస్ట్‌కి చూపించక తప్పదా' అని అనుకున్నారు.

పెళ్ళీడుకొచ్చిన బంగారు బొమ్మ రేఖ! ఇప్పుడు సైకియాట్రిస్టుల వెంట పడితే. . .ఓహ్! ఈ పని అప్పుడే చేసి ఉంటే ఇప్పుడిలా చింతించాల్సిన అవసరముండేది కాదు. ఏమిటి గత్యంతరం? ఆయన మెదడు పరిపరి విధాల ఆలోచిస్తూంది. ఆయనకు ఒక్క విషయం అంతుపట్టడం లేదు. ముసుగులో ఉన్న దొంగని చూడడంతో రేఖకు ఇదివరకటి సంఘటన గుర్తుకు వచ్చింది. బాగానే ఉంది! కాని నగలు తీసి ఇవ్వవలసిన అవసరమేముంది? ఇదేమి మానసిక ప్రక్రియ అంటూ వాపోయారు. బహుశా సినిమాలో కథానాయిక తల్లి నగలు తీసి ఇచ్చిన రీతిలోనే కూతురు కూడా ఆ పని చేసి ఉంటుందని సరిపెట్టుకున్నారు. కాని ఆయనకి ఆ ఆకారం రెండోసారి రేఖ గదిలోకి వచ్చి నగలు అడిగిందన్న విషయం తెలియదు.

శేఖర్ విపరీతమైన మానసిక వ్యథకు గురి అవుతున్నాడు. తన ముద్దుల చెల్లి కిదేం గతి? అని వాపోతున్నాడు.


రేఖ ఇప్పుడు యుక్తవయస్కురాలు. ఆమె ఈ నాలుగేళ్ళలోనూ మానసికంగా ఎంతో ఎదిగింది. అంతో ఇంతో లౌకిక జ్ఞానం అబ్బింది. నిజానికి, అబద్ధానికి గల తేడాను గమనించగల శక్తి లేకపోలేదు - ఆమెకు.

ఒకప్పుడు తనకి దయ్యంతో పరిచయమైందని, తను దయ్యంతో మాట్లాడిందని అప్పుడప్పుడు గుర్తు చేసుకున్నా, కాలక్రమేణా 'అది దయ్యం కాకపోవచ్చు' అన్న ఆలోచనని నిజం చేసి, అదే నిజంగా నమ్మడానికి ప్రయత్నించింది. 'దయ్యం కానప్పుడు మరేమిటి?' అని కూడా ప్రశ్నించుకుంది. ఏమీ అంతుపట్టలేదు. చివరికి తానొక విచిత్రమైన మానసిక స్థితికి (హాల్యూసినేషన్? లోనయి ఉంటుందని తనని తాను నమ్మించుకుంది) అది ఒక పీడ కలగా భావించి ఆ విషయం మరచిపోయింది.

ఇంకా లోతుగా చూస్తే. . . రెండవసారి దయ్యం వచ్చినప్పుడు కోరినవి ఇచ్చి మచ్చిక చేసుకుందామనుకున్న ఆమె ప్రయత్నం ఫలించింది. తను మంచి పిల్ల కాబట్టే దయ్యం తన నుంచి తీసుకున్న నగలు తిరిగి తనకే వదిలేసి వెళ్ళిందని సమర్థించుకుంది. మరల దయ్యం కనపడుతుందేమోనని ఎదురు చూసింది. 'అప్పుడప్పుడు రావచ్చా?' అని అడిగిన దయ్యం ఎంత కాలానికీ రాకపోతే, దయ్యానికి తనపై మంచి అభిప్రాయం ఏర్పడిందని, ఆ దయ్యం తన నింక ఏమీ చెయ్యదు అన్న అభిప్రాయాని కొచ్చింది.

వయసు పెరుగుతున్నకొద్దీ ఆమె ఆలోచనా దృక్పథంలో మార్పు వచ్చింది. తను దయ్యంతో కొంత సమయం గడిపిందన్న విషయం గుర్తుకొచ్చినప్పుడల్లా ఆమె ఒళ్ళు భయంతో జలదరించసాగింది. సహజసిద్ధంగా ఆమెకు దయ్యాలపట్ల ఉన్న భయమే ఆమెను 'తను ఒక విచిత్ర పరిస్థితికి లోనయిందేతప్ప దయ్యంతో గడపలేదు' అని అనుకునేటట్టుగా చేసింది. అది ఒక పీడ కలగా భావించి ఆ విషయం మరచిపోయేటట్టుగా చేసింది.

ఆ దయ్యం మళ్ళీ వస్తుందేమో, తనని దొంగ దెబ్బ తీస్తుందేమో నన్న భయం అంతర్గతంగా ఏదో మూల దాగి ఉండి ఆమెను థియేటర్‌లో అలా ప్రవర్తించేటట్టుగా చేసింది. తెరమీద చూస్తున్న దొంగలో దొంగని చూడక ఆ నల్ల ముసుగులో ఉన్నది దయ్యమేనని భ్రమ పడింది. ఆమెలో చెలరేగిన మానసిక సంఘర్షణలో సినిమా చూస్తున్నానన్న విషయం మరచిపోయింది. నగలు ఇచ్చేస్తే ఇదివరకటిలాగానే ఆ దయ్యం సంతోషించి వెళ్ళిపోతుందని భావించింది. తనకి ఆ దయ్యంవల్ల హాని కలుగదని ఆశించింది.




రేఖకి ఏమీ పాలుపోవటంలేదు. తనని ఈ భయం ఏడే కొస్తుందు?

రోజులు గడుస్తున్నాయి. నానాటికీ రేఖలో భయం ఎక్కువ కాసాగింది. 'ఆ దయ్యం ఎప్పుడు ఎక్కడనుంచి వస్తుందో, తనని ఏం చేస్తుందో,' అన్న భయంకరమైన ఆలోచన ఆమెను క్రుంగదీస్తోంది. ఆ మానసిక పరిస్థితి నుంచి తన విచక్షణా జ్ఞాన ముపయోగించి ఎంత బయటపడదామను కున్నా కుదరటంలేదు. రోజురోజుకీ ఆ దయ్యాన్ని మరల చూడాలని, ఈసారి తన నగలు, ఆస్తి మొత్తం ఆ దయ్యాని కిచ్చేసి 'పీడ' వదిలించుకోవాలనే ఆరాటం ఎక్కువవుతోంది. తన కప్పుడే మనశ్శాంతి లభించగలదని ఆశిస్తోంది.

చివరికి రేఖ ఆరాటపడుతున్నట్టుగానే, ఒక రోజు ఆ దయ్యం మరల రావటం, ఆమె నగలన్నీ ఇవ్వటం, దయ్యం ఆ నగలన్నీ తిరిగి ఆమెకు ఇచ్చెయ్యటం, తన కా నగలు వద్దని, అవి దయ్యం దగ్గరే ఉండనిమ్మని రేఖ మొరాయించడం, తనకా నగలతో పనిలేదని, అవి రేఖ ఒంటిమీద ఉంటేనే వాటికి అందం వస్తుందని దయ్యం ఆమెకు నచ్చచెప్పటం, ఇంక జన్మలో ఆమె జోలికి రానని, తనని ఆమె మరచిపోవచ్చని, ఆమెకు ఎటువంటి కీడూ తలపెట్టనని ఆ దయ్యం రేఖకు ధైర్యం చెప్పటం జరిగిపోయాయి! రేఖ మనసు చాలావరకు కుదుట పడింది. కాని ఆ దయ్యం తన నగలు తీసుకోలేదన్న కించిత్తు బాధ ఆమెలో ఉండిపోయింది. వాటికోసం మరల ఆ దయ్యం ఎప్పుడో అప్పుడు తనని దొంగదెబ్బ తీస్తుందేమోనన్న తన అనుమానం, చిరుభయం ఆమెలో ఏదో మూల అప్పుడప్పుడు తొంగి చూస్తూనే ఉన్నాయి. రోజులు గడవసాగాయి. ఏది ఏమైనా దయ్యంమీద నమ్మకంతో కాలక్షేపం సాగింది.

• • • •

రేఖ మళ్ళీ మామూలు మనిషయిపోయింది. ముకుందరావుగారు, శేఖర్‌ల సంతోషానికి అవధుల్లేవు. ఆమె పుట్టినరోజు పండుగ పెళ్ళి జరిపినంత వైభవంగా చేశారు. ఆ రోజు విచ్చేసిన అతిథుల్ని సాగనంపి నిద్ర కుపక్రమించేటప్పటికి రాత్రి పదకొండు గంటలయింది. రంగయ్య మిగతా పనులు పూర్తిచేసి పడుకునేటప్పటికి ఒంటిగంట దాటింది.

• • • •

భళ్ళున తెల్లవారింది. సమయం ఏడున్నర గంటలు!

"అయ్యగారు...బాబుగారు ... ఘోరం ... ఘోరం ...జరిగిపోయింది ... ఘోరం జరిగి పోయింది!" అని లబోదిబో మంటూ రంగయ్య ముకుందరావుగారి గది తలుపులు బాదుతున్నాడు.

గది తలుపులు తీసి "ఏంటి, రంగయ్యా? ఏమయింది?" అని కంగారుగా ప్రశ్నించారు ముకుందరావుగారు.

"బాబూ! అన్యాయం. ఇల్లంతా దోచేశారు!

ఇంటి వెనకవైపు తలుపులు, రేఖమ్మగారి గది కున్న అవతలివైపు తలుపులు తీసేసి ఉన్నాయి. రేఖమ్మగారు ఎక్కడా కనపడటం లేదు! ఇల్లంతా వెదికాను! శేఖర్‌బాబు మాత్రం గదిలో నిద్ర పోతున్నారు'' అని ఏడుపు గొంతుతో చెప్పాడు రంగయ్య.


ఫోన్లు...పోలీస్ స్టేషన్లు ... పోలీసులు... డిటెక్టివ్ ఏజన్సీస్ ... డిటెక్టివులు ... ఇన్వెస్టిగేషన్స్ ...బ్లాక్ రాకెట్ అనే దొంగల ముఠా... నల్లటి ముసుగులు ధరించి దోపిడీలు... నల్ల దయ్యాల దోపిడీలు ... దొంగలు ముందు రేఖ గదిలోనే ప్రవేశించారు. ఆమె సహాయంతోనే... ఆ ఇంటిలో ఎవరు ఎక్కడ పడుకుంటారో, విలువైన వస్తువులు ఎక్కడెక్కడ ఉంటాయో తెలుసుకున్నారు. అందువల్లనే ఆ దొంగలు గత పదేళ్ళుగా నగరంలో కనీ వినీ ఎరుగని మేజర్ రాబరీ అంత నీటుగా చేసుకోగలిగారు. ఇవన్నీ పరిశోధనలలో తేలిన కొన్ని నిజాలు. ఇన్వెస్టిగేషన్స్... దొంగలకై...రేఖకై...వేట...ఆస్తి కొంత దొరికింది. బట్ దొంగలు దొరకలేదు. సంవత్సరం... రెండు... మూడు సంవత్సరాలు...రేఖ...రేఖ...రేఖ అచూకీ లేదు.

● ● ● ●

అదీ జరిగిన కథ ! మెంటల్ అస్సైలమ్‌లో గత మూడు సంవత్సరాలుగా చికిత్స పొందుతూ ప్రస్తుతం కోలుకుంటున్న శేఖర్‌కి కన్నీటితో ఏడ్పులు వరికి బయటికి వచ్చాయి. అయితే కథ అయిపోలేదు. ప్రస్తుతం శేఖర్ గురించి కొంత మీకు తెలపాల్సిన బాధ్యత నాపై ఉంది.

థియేటర్‌లో జరిగిన సంఘటన తరువాత శేఖర్ అంతులేని మానసిక వ్యథకు గురయ్యాడు. తన చెల్లెలి మానసిక పరిస్థితి రోజు రోజుకీ దిగజారి పోవటంతో అతనిలో విపరీతమైన 'గిల్టీ నెస్' చోటు చేసుకోసాగింది. ఒకరోజు అతను రేఖ డైరీ చదవటం తటస్థించింది. అందులో రేఖ చాలా చోట్ల 'నాకు దయ్యం గురించిన ఆలోచనలు రోజు రోజుకీ ఎక్కువవుతున్నాయి. మానసికంగా క్రుంగిపోతున్నాను. డాడీ నా గురించి లోపల తాను కుమిలిపోతున్నారే కాని, నన్ను డాక్టర్ దగ్గరికి తీసుకువెళ్ళటం లేదు. నాకేం చేయాలో పాలుపోవటం లేదు. పాపం ! శేఖర్ అన్నయ్య ! నా గురించి అన్నం, నీళ్ళు మానేసి చిక్కి శల్యమై పోతున్నాడు. నాకెంతో ధైర్యం చెప్పటానికి ప్రయత్నిస్తున్నాడు .కాని నేను ఒక అశక్తురాలి నయి పోయాను. మళ్ళా ఆ దయ్యం వస్తే బాగుండును! నా నగలన్నీ ఇచ్చేసి పీడ వదిలించేసుకోవాలి . నా కప్పుడే మనశ్శాంతి!' అని రాసుకుందట.

శేఖర్‌కి దయ్యంగా మారక తప్పలేదు. తనే నల్లటి ముసుగులో వెళ్ళి దయ్యంగా చెల్లెలి ముందు ప్రత్యక్ష మయ్యాడు! తానింక ఎప్పుడూ ఆమె జోలికి రానని, తనని మరిచిపోవచ్చుని, తన వల్ల ఆమె కెటువంటి హానీ కలగదని, దయ్యం వేషంలో ఆమె కోరుకున్నట్టుగా రేఖని నమ్మించాడు. ఆ




సంఘటన తరవాత చెల్లెలిలో వచ్చిన మార్పును చూసి అతను హాయిగా వూపిరి పీల్చుకున్నాడు. బర్త్‌డే పార్టీ గ్రాండుగా జరిపించాడు.

ఇంకా కొన్ని నిజాలు చెప్పాలి! అంతకుముందు రెండు సార్లు దయ్యంగా ప్రత్యక్ష మయింది మరెవ్వరో కాదు! శేఖరే! మొదటిసారి కేవలం ఒక తుంటరిపని చేద్దామనే దృష్టితో తను స్కూల్లో దయ్యంగా స్టేజిమీద కనపడటానికి ఉపయోగించిన ఫ్యాన్సీ డ్రెస్‌ని ఉపయోగించాడు. కాని రేఖ అరవగానే భయపడి పరిగెత్తుకుంటూ వచ్చి తన గదిలో ఏమీ ఎరగనట్టు పడుకున్నాడు. రంగయ్య విన్న ఆ అడుగుల సవ్వడి శేఖర్‌దేనని వేరే చెప్పనక్కర లేదు.

కాని తను ఏదో సరదాకి చేసిన పని రేఖలో అంతటి కలవరం తెస్తుందని అతనెప్పుడూ వూహించ లేదు. గిల్టీగా ఫీలవటం మూలంగా, ఆమె మనో పరిస్థితికి తనే కారకుడని ధైర్యంగా నిజం చెప్పలేక పోయాడు తండ్రితో.

ఆ తరవాత మళ్ళీ ఆమెకు ఆ రూపంలో కనపడి, ఆమె రియాక్షన్ ఎలా ఉంటుందో చూసి దానిని బట్టి రేఖని సైకియాట్రిస్ట్ దగ్గిరికి తీసుకు వెళ్ళటమా లేదా అన్నది నిర్ణయిద్దామనుకున్నాడట. రెండవసారి తను ముసుగు వేసుకోవటానికి ఎంతో నాటకం ఆడాల్సి వచ్చింది. ఆ రోజు కాలేజీకి బయలు దేరాడు. ఆకాశం మేఘావృత మయి ఉంది. రంగయ్య వూళ్ళో లేడు. తండ్రి తన కంటే ముందే ఇంటి నుంచి వెళ్ళిపోయాడు. వర్షం ఏ నిమిషమైనా రావచ్చు. కాలేజీకి వెళ్ళకుండా మార్గమధ్యంలోనే ఇంటికి తిరుగుముఖం పట్టాడు. రేఖ చూడకుండా మళ్ళీ ఇంటిలో ప్రవేశించాడు. మబ్బులు తేలి పోయాయి. ఎండ కాయసాగింది. రంగయ్య ఆ రోజు సాయంత్రం వూరు నుంచి వచ్చేస్తాడు. అతనొచ్చాక తనకు దయ్యం ముసుగులో వెళ్ళడం కష్టమవుతుంది 'ఇంకేం చెయ్యాలా?' అని ఆలోచిస్తూ, సాయంత్రం వరకు ఫస్టు ఫ్లోర్‌లోని గదిలో నిరీక్షిస్తూ కూర్చు న్నాడు మబ్బుల కోసం! అదృష్టవశాత్తు సాయంత్రానికి ఆకాశం నిండా దట్టమైన మబ్బులు కమ్ము కున్నాయి. జోరున వర్షం మొదలయింది, ఉరుము లతో పిడుగులతో! ఇంట్లోని కిటికీలు దాలావరకు మూసేశాడు. చీకటి అలుముకుంది ఇంట్లో. రేఖ గదిలోకి వెలుతురు వచ్చే అవకాశం చాలా తక్కువ ఎర్రని ఎండ కాస్తున్నప్పుడే! పైగా బయట దట్టమైన మబ్బులు! తను ముసుగు ధరించి అవతారం ఎత్తటానికి చక్కని వాతావరణం తోడయింది! శేఖర్ రేఖ ముందు ప్రత్యక్ష మయ్యాడు దయ్యం ఆకారంలో! రేఖ తనని చూడగానే కెవ్వుమని కేక వేస్తుందనో, స్పృహ తప్పి పడిపోతుందనో వూహించాడు. కాని అతని వూహలకి భిన్నంగా ఆమె ప్రవర్తించిన తీరు అతన్ని ఎంతో విస్మయు పరిచింది. తనేదో వూరికే అడిగితే నిజంగానే నగలు తీసేసి ఇవ్వటంతో ఆమె ఆలోచనలు శేఖర్ పసికట్టసాగాడు. ఆ ఆకారాన్ని మచ్చిక చేసుకోవాలని, అలా చేసుకునే దానివల్ల తన కేమీ కీడు సంభవించదని రేఖ నమ్ముతూందని తను గ్రహించాడు. మిగతాది మీకు తెలిసిందే.

అయితే ఆ ఆకారాన్ని రేఖ దయుంగా భావిస్తూం దని శేఖర్‌కి తెలిసిన క్షణం అతని నోటమ్మట మాట రాలేదు. తనని ఎంతో ప్రేమగా చూసుకునే తన ముద్దుల చెల్లెలు ఆ నల్ల ముసుగులో ఉన్న తనని 'దయ్యం'గా 'పీడ'గా భావిస్తూందన్న భావన అతన్ని కలచి వేసింది. చివరికి ఆ దొంగలతో మారు మాట్లాడ కుండా వెళ్ళిపోవటానికి తన చెలిపి చేష్టయే కారణ మన్న సత్యం తన బంగారు తల్లిని ఆ నల్ల దయ్యాలకి అప్పగించిన 'దయ్యం' తనే నన్న నిజం అతని మనసులో సంక్షోభం లేవదీశాయి. "సైకో"గా మార్చి మెంటల్ అసైలంలో చేర్పించాయి.

కాని రేఖ...నాకు తెలుసు ఆమె ఎక్కడో క్షేమం గానే ఉందని! చాలా మందికి అందం 'శాప'మయితే ఆమెకు ఆ అందమే 'రక్ష' అవుతుందని నా ప్రగాఢ విశ్వాసం! అవును! రేఖ ముగ్ధమోహన అపురూప సౌందర్యవతి! ఆమెను సృష్టించిన వాడే ఆమెకు హాని తల పెట్టలేడు! ఈ దయ్యాలు, నల్లముసుగులు ఏం చేయగలవు? నిజమే! ఆమె ఎక్కడో క్షేమంగానే ఉంది! కాని...కాని...ఏది ఎక్కడ ఉండాలో అక్కడ ఉంటేనే అందం. ★